
సాక్షి
ఒడిశా
గురువారం । 27 । ఏప్రిల్ । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలకవర్గం బుధవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.3,16,095లు, బంగారం 1.9 గ్రాములు, వెండి 49.15 గ్రాములు వచ్చాయని అధికారులు వెల్లడించారు.



రాష్ట్రంలో మరో కోవిడ్ మృతి

- 8లో



పోలీసుల జన సంపర్క శిబిరం

మల్కన్‌గిరి: జిల్లాలోని చిత్రకొండ సమితి స్వాభిమాన్ ఏరియాలో జిల్లా పోలీసు యంత్రాంగం తరుపున బుధవారం జనసంపర్క శిబిరం నిర్వహించారు. ఎస్‌డీపీఓ కిస్పేట్ ఆర్యంలో గిరిజనులకు దుస్తులు, క్రీడా సామగ్రి, పుస్తకాలు అందించారు.

న్యూస్‌రీల్

విద్యుత్ షాక్‌తో బాలిక మృతి



విద్యార్థి మృతదేహాన్ని ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

రాయగడ: జిల్లాలోని గుణుపూర్ సబ్ డివిజన్ గొట్లపా దోరో పరిధి కుకర్‌గుడ గ్రామంలో విద్యుత్ షాక్‌తో బాలిక మృతి చెందింది. మృతురాలు ప్రియ నిమల(10) గా పోలీసులు గుర్తించారు. సాలోపూర్ ఆశ్రమ పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న ప్రియ.. గత పాఠశాలలకు సెలవులు ప్రకటించడంతో స్వగ్రామానికి వచ్చింది. బుధవారం ఉదయం ఇంటికి సమీపంలోని జామచెట్టు ఎక్కి, కాయలను కోసేందుకు ప్రయత్నిస్తుండగా పక్కనే ఉన్న విద్యుత్ వైర్ తగిలి, కింద పడిపోయింది. గమనించిన స్థానికులు విద్యార్థిని ఆస్పత్రికి తరలించే ప్రయత్నం చేయగా.. అప్పటికే మృతిచెందింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుణుపూర్ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

నిరుద్యోగిని మోసం చేసిన వ్యక్తి అరెస్ట్



పోలీసుల అదుపులో నిందితుడు సురేష్

మల్కన్‌గిరి: విద్యుత్ శాఖలో ఉద్యోగాలు ఇప్పిస్తానని నిరుద్యోగుల నుంచి డబ్బులు వసూలు చేసిన వ్యక్తిపై కలిమెలకు చెందిన బాధితుడు పుర్వేంద్‌కుమార్ బారికి పోలీసు స్టేషన్‌లో ఇటీవల ఫిర్యాదు చేశాడు. దీనికి సంబంధించి సురేశ్‌కుమార్ పండా అనే వ్యక్తికి 2022 అక్టోబర్ 1న రూ.40 వేలు చెల్లించినట్లు తెలిపారు. అయితే ఇప్పటికీ ఉద్యోగం ఇవ్వక పోవడంతో మోసపోయినట్లు గ్రహించిన అతను.. పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేయగా నిందితుడు సురేష్ భువనేశ్వర్‌లో ఉన్నట్లు గుర్తించారు. ప్రత్యేక బృందంతో అక్కడికి చేరుకొని, అరెస్ట్ చేయడంతో పాటు బుధవారం మల్కన్‌గిరి జిల్లాకు తీసుకువచ్చారు. అతని వద్ద నుంచి 8సెల్‌ఫోన్లు, పేమెంట్ టెర్మినల్ మిషన్లు, ఇతర పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. గురువారం కోర్టులో హాజరు పరచనున్నట్లు పోలీసులు తెలిపారు.

నష్టాన్ని సమీక్షించిన ఎమ్మెల్యే దియాన్



దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పద్మినీ దియాన్

జయపురం: గత 3 రోజులుగా సబ్ డివిజన్ పరిధిలో కురుస్తున్న వర్షాలు, ఈదారు గాలులకు పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఈ నేపథ్యంలో పంట నష్టాన్ని అంచనా వేసేందుకు మాజీమంత్రి, కొట్‌పాడ్ ఎమ్మెల్యే పద్మినీ దియాన్ తన నియోజకవర్గ పరిధిలోని బొరిగుమ్మ సమితి అవులి, డెంగాపాదర్ పంచాయతీల్లో బుధవారం పర్యటించారు. ఎంపీ ప్రతినిధి కేశవ పండా, కొరాపుట్ జిల్లా పరిషత్ మాజీ అధ్యక్షురాలు మాలతీ మాఝి, తహసీల్దార్ సవ్యసాచి జెనా, బొరిగుమ్మ వ్యవసాయ అధికారి, సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు. అకాల వర్షాల కారణంగా దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించారు. 2 పంచాయతీల్లో ప్రాథమిక నివేదిక ప్రకారం 200లకు పైగా ఎకరాల్లో మొక్కజొన్న, చెరుకు, వరి, కాయగూరల పంటలు ఎక్కువగా నష్టం వాటిల్లినట్లు అధికారులు తెలియజేశారు. ఎమ్మెల్యే స్వయంగా బాధిత రైతులతో మాట్లాడి, వివరాలు తెలుసుకున్నారు. నష్టపోయిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం తరఫున సాయం అందిస్తామని హామీ ఇచ్చారు. వెంటనే పూర్తి నివేదికను అందించాలని సంబంధిత అధికారులకు సూచించారు.

యుగ పురుషుడు.. కృష్ణచంద్ర గజపతి

- ఘనంగా కృష్ణచంద్ర గజపతి నారాయణ దేవ్ జయంతి ఉత్సవాలు
- పూలమాలలు వేసి, నివాళులర్పించిన అధికారులు, ప్రజాప్రతినిధులు
- ఆకట్టుకున్న కళాకారుల కత్తి, కర్రసాము ప్రదర్శనలు



బరంపురం: కృష్ణచంద్ర గజపతి విగ్రహం వద్ద నివాళులరిస్తున్న వివిధ సంఘాల ప్రతినిధులు



పర్లాకిమిడిలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పర్లాకిమిడి: స్వతంత్ర రాష్ట్ర అవతరణకు అలుపెరుగని పోరాటం చేసిన పర్లాకిమిడి మహారాజా కృష్ణ చంద్ర గజపతి నారాయణ దేవ్ యగ పురుషుడని అధికారులు, ప్రజా ప్రతినిధులు కొనియాడారు. బుధవారం ఆయన జయంతి సందర్భంగా స్థానిక పాతబస్టాండ్ వద్ద ఉన్న నారాయణ దేవ్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. గజపతి వంశీయురాలు కల్యాణీదేవి గజపతి, కలెక్టర్ లింగరాజ్ పండా, మున్సిపల్ చైర్మన్ నిర్మలాశెఠి, సబ్ కలెక్టర్ అలోక్ ప్రధాన్, ఎస్డీసీ చైర్మన్ మరియం రైతో, బీజేడీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు పూర్ణబాసి నాయక్, బీజేడీ నాయకులు ప్రదీప్‌నాయక్, సుధీర్‌రంజన్ మహాపాత్రో తదితరులు హాజరయ్యారు. అనంతరం పాతబస్టాండ్, గజపతి ప్యాలెస్ ఎదుట పాయక్ కళాకారులు ప్రదర్శించిన కత్తి, కర్రసాము ఆకట్టుకున్నాయి. కుమ్మరివీధి వద్ద మహారాజా సమాధి వద్ద యువరాణి, కలెక్టర్, జిల్లా అధికారులు పుష్పాంజలి ఘటించారు. అలాగే సత్యసాయి పాఠశాల విద్యార్థులు పట్టణంలో ర్యాలీ చేపట్టారు.

రాయగడ: స్వాతంత్ర ఒడిశా నిర్మాణానికి ఊపిరి పోసిన యుగపురుషుడు పర్లాకిమిడి మహారాజ కృష్ణ చంద్ర గజపతిని వక్తలు కొనియాడారు. కృష్ణచంద్ర గజపతి కళా, సంస్కృతి పరిషత్ ఆధ్వర్యంలో ఆయన జయంతి కార్యక్రమాన్ని పట్టణంలోని గజపతి కూడలిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఆదివాసీ, హరిజన సంక్షేమశాఖ మంత్రి జగన్నాథ సరక, రాయగడ ఎమ్మెల్యే మకరంద ముదులి, మున్సిపాలిటీ చైర్మన్ మహేష్ పట్నాయక్, డాక్టర్ డీకే మహంతి, సత్యవాది పతి తదితర ప్రముఖులు పాల్గొని, గజపతి విగ్రహానికి పూలమాలలు వేశారు. కళా పరిషత్ అధ్యక్షుడు అమూల్యరత్న సాహు పర్యవేక్షించగా, పరిషత్ కార్యదర్శి దిలీప్ కుమార్ మిశ్రా, ఉపాధ్యక్షుడు మనోజ్‌కుమార్ రథొ, కోశాధికారి తిరుపతి పండా తదితరులు పాల్గొన్నారు.



గజపతి ప్యాలెస్ ఎదుట కర్రసాము విన్యాసాలు



తన తాతగారి సమాధి వద్ద నివాళులర్పిస్తున్న యువరాణి కల్యాణి గజపతి, కలెక్టర్



రాయగడ: నివాళులర్పిస్తున్న మంత్రి సరక, ఎమ్మెల్యే ముదులి, చైర్మన్ పట్నాయక్



మహారాజా స్మృతివనంలో కత్తులు ప్రదర్శిస్తున్న కలెక్టర్, అధికారులు, ప్రజా ప్రతినిధులు

వార్షిక క్రీడోత్సవాలు ప్రారంభం



పాటల పోటీలో ప్రతిభ చూపుతున్న యువతి



టేబుల్ టెన్నిస్‌లో తలపడుతున్న చిన్నారులు

భువనేశ్వర్: ఖుర్దారోడ్ బీజేజీ రైల్వే ఇనిస్టిట్యూట్ వార్షిక క్రీడోత్సవం బుధవారం ప్రారంభమైంది. స్థానిక తూర్పుకోస్తా రైల్వే మహిళా సంక్షేమ సంఘం అధ్యక్షురాలు శుభలక్ష్మి జెనా జ్యోతి ప్రజ్వలనతో ఈ ఉత్సవం ప్రారంభమైనట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా నిర్వహించనున్న పలు పోటీల్లో ఆబాల గోపాలం పాల్గొనేందుకు వీలుగా వేదిక ఏర్పాటు చేశారు. కేరమ్, టేబులన్ టెన్నిస్, పాటలు, నృత్య, మెహందీ, రంగోలి, చిత్రలేఖనం పోటీలు ఈనెల 28వరకు 3 రోజులపాటు నిరవధికంగా కొనసాగుతాయని నిర్వాహక సంస్థ కార్యదర్శి అక్షయకుమార్ ప్రధాన్ తెలిపారు. గురువారం ఉదయం 7 గంటల నుంచి ఖుర్దారోడ్ రైల్వేస్టేషన్ నూతన ప్రవేశ ప్రాంగణం ఆవరణలో రంగోలి పోటీ జరగనున్నాయి. తొలిరోజు టేబుల్ టెన్నిస్, నృత్య, చిత్రలేఖనం, పాటల పోటీల తొలి దశ ముగిసింది.

విద్యార్థిని మృతిపై ఆందోళన

పర్లాకిమిడి: బెత్తగుడ వద్ద జవహర్ నవోదయ విద్యాలయంలో 65రోజుల క్రితం మృతిచెందిన కాశీనగర్ బ్లాక్ వల్లాడ గ్రామానికి చెందిన విద్యార్థిని సౌదామిని రైతో(15) ఘటనకు ప్రిన్సిపాల్ బాధ్యత వహించాలని బాధిత కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు. వాస్తవాలు నిగ్గు తేల్చేలా క్రైం బ్రాంచ్‌తో సమగ్ర దర్యాప్తు చేయాలని విద్యార్థిని తల్లి సుజ్ఞాని గమాంగో, కుటుంబ సభ్యులు కేదార్ శబోరో, వల్లాడ గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు విద్యాలయం ప్రధాన ద్వారం ఎదుట బుధవారం ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న కాశీనగర్ ఐఐసీ సాహు, పర్లాకిమిడి ఎస్‌డీపీఓ రామకృష్ణపతి పోలీసు బలగాలను మోహరించారు. ఒక దశలో సౌధామిని తల్లి విద్యాలయం లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించగా, పోలీసులు నివారించారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు ఆందోళన కొనసాగిస్తామని గ్రామస్తులు స్పష్టంచేశారు.



ధర్నా చేస్తున్న బాధిత కుటుంబీకులు

టికిరిలో మే 7న రైల్‌రోకో



సమావేశంలో పాల్గొన్న వివిధ సంఘాల ప్రతినిధులు

రాయగడ: జిల్లాలోని టికిరిలో మే 7న రైల్‌రోకో ఆందోళన చేపట్టనున్నట్లు టికిరి నాగరిక మంచ్, వాణిజ్య సంఘాలు సంయుక్తంగా పిలుపునిచ్చాయి. టికిరి రైల్వేస్టేషన్‌లో సమలేశ్వరి ఎక్స్‌ప్రెస్ రైలుకు హాల్టింగ్ సౌకర్యం కల్పించాలని పలుమార్లు సంబంధిత శాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఇంతవరకు స్పందించక పోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలియజేశారు. ఈ మేరకు టికిరి శివమందిరంలో బుధవారం నిర్వహించిన సమావేశంలొ కాసీపూర్ సమితి అధ్యక్షుడు కొంతొ మాఝి, బీజేడీ నాయకుడు బినోద్‌నాయక్, వాణిజ్య సంఘాల అధ్యక్షుడు మున్నా బెహర తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కరోనా సమయంలొ టికిరిలో సమలేశ్వరి ఎక్స్‌ప్రెస్ హాల్టింగ్‌ను రద్దు చేశారని, అప్పటి నుంచి పునరుద్ధరించక పోవడంపై విచారం వ్యక్తంచేశారు.

వారసత్వాన్ని పరిరక్షించుకోవాలి



వేదికపై ఎంపీ చంద్రశేఖర్ సాహు, ఎమ్మెల్యే, బీడీఏ చైర్మన్

- మహానగర్ ఉత్సవాల్లో ఎంపీ చంద్రశేఖర్ సాహు పిలుపు

బరంపురం: మన భాష, కళా, సంస్కృతిని పరిరక్షించు కోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని బరంపురం ఎంపీ చంద్రశేఖర్ సాహు తెలిపారు. నగరంలోని కల్లికోట్ విశ్వవిదాలయం మైదానంలో మహోత్సవాల కమిటీ ఆధ్వర్యంలో 11వ మహానగర్ మహోత్సవాలు మంగళవారం సాయంత్రం ఘనంగా ప్రారంభమయ్యాయి. బరంపురం ఎంపీ చంద్రశేఖర్ సాహు ముఖ్య అతిథిగా హాజరు కాగా.. ఎమ్మెల్యే విక్రమ్ పండా, మేయర్ సంఘమిత్ర దొళాయి, బీడీఏ చైర్మన్ సుభాష్ మహరాణ పాల్గొని, జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాలను ప్రారంభించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ ప్రపంచ దేశాల్లో ఒరియా భాష, సంస్కృతి, కళలకు ఎంతో గౌరవ ప్రతిష్టలు ఉన్నాయని గుర్తుచేశారు. వాటిని పరిరక్షించు కోవాల్సిన బాధ్యతలు ప్రతి భారతీయుడిపై ఉందని తెలిపారు. మహోత్సవాల్లో సంగీత, సంస్కృతిక నృత్యలతో అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో బరంపురం విశ్వ విద్యాలయం వైస్ ఛాన్సలర్ గీతాంజలి దాస్, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు భారత్ నారాయణ మాంకుడో, కార్యదర్శి గోపాల్ పట్నాయక్, సుదీప్‌కుమార్ సాహు తదితరులు పాల్గొన్నారు.



మహానగర్ ఉత్సవాల్లో పాల్గొన్న కవులు, కళాకారులు, దర్శకులు

• వీరులకు వందనం



'ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్స్(డీఆర్‌జీ) జవాన్లు ధైర్యవంతులు. వారందరికీ వందనం. జవాన్ల పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాల'ని ప్రముఖ సైకతశిల్పి సుదర్శన్ పట్నాయక్ సంతాపం ప్రకటించారు. ఈ సందర్భంగా పూరీ సాగర తీరంలో బుధవారం సైకతశిల్పం తీర్చిదిద్ది, నివాళులర్పించారు. - భువనేశ్వర్

సరిహద్దు జిల్లాల్లో హైఅలర్ట్

- ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టుల దాడి తదనంతర చర్యలు



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న బీఎస్ఎఫ్ బలగాలు

భువనేశ్వర్: పొరుగు రాష్ట్రం ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టుల దాడిలో 10మంది పోలీసులు సహా 11మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనతో రాష్ట్రంలో మూడు జిల్లాలకు బుధవారం హైఅలర్ట్ ప్రకటించారు. ఛత్తీస్‌గఢ్ సరిహద్దు జిల్లాల్లోని భద్రతా సిబ్బంది అప్రమత్తంగా, జాగ్రత్తగా ఉండాలని ఆదేశాలు జారీ చేశారు. సరిహద్దులు పంచుకునే మల్కన్‌గిరి, కొరాపుట్, నవరంగ్‌పూర్ జిల్లాలకు ఇది వర్తించనుంది. ఈ మూడు జిల్లాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పహరా, బ్లాకింగ్, తనిఖీలను ముమ్మరం చేయాలని ఇంటెలిజెన్స్ డైరెక్టర్ సంజీబ్‌పండా పోలీసు సిబ్బందికి సూచించారు. ఈ ప్రాంతాల్లో పోలీసులు గట్టి నిఘా ఉంచాలని తెలిపారు. ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టుల దాడి తర్వాత రాష్ట్రంలోని వివిధ మావోయిస్టు ప్రభావిత జిల్లాల్లో కూంబింగ్ కార్యకలాపాలను ముమ్మరం చేసేందుకు చర్యలు ప్రారంభించారు. దంతెవాడ సమీపంలో మావోయిస్టులు పేలుడు జరిపి డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్స్(డీఆర్‌జీ) వాహనాన్ని ఇంప్రూవైజ్డ్ ఎక్స్‌ప్లోజివ్ డివైజ్(ఐఈడీ)తో పేల్చివేశారు. ఈ ఘటనలో ఛత్తీస్‌గఢ్ డీఆర్‌జీకి చెందిన 10మంది సిబ్బంది, డ్రైవర్ మృతి చెందారు. దాడి ఘటనను సీఎం నవీన్ పట్నాయక్ తీవ్రంగా ఖండించారు. తమ ప్రాణాలను అర్పించిన వీర యోధులకు నివాళులు ప్రకటించారు. వీర హృదయాలను కోల్పోయిన కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నట్లు సంతాప సందేశం విడుదల చేశారు.

క్లుప్తంగా

రాష్ట్రంలో మరో కోవిడ్ మృతి

భువనేశ్వర్: రాష్ట్రంలో కొద్దికాలం దిగుముఖం పట్టిన కోవిడ్–19 క్రియాశీలత క్రమంగా పుంజుకుంటోంది. గత 24 గంటల్లో నిర్వహించిన 7,571 పైగా నమూనాలు పరీక్షించగా, కొత్తగా 542 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. గత 8నెలల్లో రాష్ట్రంలో కోవిడ్–19 అత్యధిక రోజువారీ కేసులోడ్ కావడం కలవర పరుస్తోంది. తాజాగా జారీచేసిన నివేదిక మరో కోవిడ్–19 మరణం ధ్రువీకరించింది. రాష్ట్రంలో ప్రస్తుతం 3,270 యాక్టివ్ కోవిడ్–19 కేసులు ఉండగా, టెస్ట్ పాజిటివిటీ రేటు(టీపీఆర్) 7.1శాతం కొనసాగుతున్నట్లు రాష్ట్ర ఆరోగ్యశాఖ విడుదల చేసిన తాజా గణాంకాలు వెల్లడిస్తున్నాయి. సోమ, మంగళవారం రెండు రోజుల్లో వరుసగా 392, 393 కొత్త కోవిడ్–19 కేసులు నమోదయ్యాయి. ఒమిక్రాన్ సబ్ వేరియంట్‌లు ఎక్స్‌బీబీ 1.16, ఎక్స్ఎక్స్‌బీ 2.3 సంక్రమణ కోవిడ్–19 కేసుల పెరుగుదల ప్రేరేపించినట్లు స్థానిక ఇనిస్టిట్యూట్ ఆఫ్ లైఫ్ సైన్సెస్(ఐఎల్ఎస్), ప్రాంతీయ వైద్య పరిశోధన కేంద్రం (ఆర్ఎంఆర్సీ)లో పరీక్షించిన 77 నమూనాలలో, తాజా సబ్ వేరియంట్ ఎక్స్ఎక్స్‌బీ 2.3 ఒక కేసు, అదనపు మ్యుటేషన్ ఎక్స్‌బీబీ 2.3.2 సంక్రమణ రెండు కేసులు నిర్ధారించారు. గతవారం రాష్ట్రంలో సుమారు 3,000 కొత్త ఇన్ఫెక్షన్లు నమోదయ్యాయి.

కనుల పండువగా సీతారామ కల్యాణం



సీతారాముల కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

విజయనగరం రూరల్: మండలంలోని కోరుకొండ రోడ్డులో ఉన్న ఆధ్యాత్మిక కేంద్రం రామనారాయణంలో సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని బుధవారం వేడుకగా నిర్వహించారు. పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆలయ ప్రధాన అర్చకులు పీవీజె చాణక్య, జీఎస్ హర్ష ఆధ్వర్యంలో ఉదయం 7 గంటలకు స్నపనం, పంచామృతాభిషేకం, సహస్రనామ కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం వేదమంత్రాల నడుమ సీతారాముల కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్‌సీఎస్ ట్రస్టీలు నారాయణం శ్రీనివాస్, నీరజవల్లి దంపతులు, మేనేజర్లు శ్రీనివాసరాజు, ఎంవీ రమణ, భక్తులు పాల్గొన్నారు.

కస్తూర్బా సిబ్బందికి గాయాలు

భోగాపురం: మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాల సిబ్బందికి తీవ్ర గాయాల పాలైన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. విద్యార్థులు, సిబ్బంది తెలిపిన వివరాలు.. పాఠశాలలో ఉదయం అంబలి కోసం స్టౌపై మరుగుతున్న నీరు ఒక్కసారిగా కింద పడిపోవడంతో అక్కడే ఉన్న వంట కుక్‌తో పాటు నైట్ వాచ్‌మేన్ దుర్గభవానీకి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో వారిని చికిత్స నిమిత్తం సుందరపేట సీహెచ్‌సీకి తరలించారు.

జెడ్పీహెచ్ పాఠశాలలో ఆకతాయిల విధ్వంసం



పాఠశాలలో విరగ్గొట్టిన ఫ్యాన్లు, బెంచీలు

సాలూరు: మండలంలోని మామిడిపల్లి గ్రామంలో జెడ్పీహెచ్ పాఠశాలలో ఫ్యాన్లు, బెంచీలు, గొట్టాలు ఇతర సామగ్రిని కొందరు ఆకతాయిలు విరగ్గొట్టి విధ్వంసం సృష్టించారు. బుధవారం ఉదయం పాఠశాలకు వెళ్లిన ఉపాధ్యాయులు గదుల్లో ఫ్యాన్లు, బెంచీలు విరిగి ఉండడం, ఏసీ పాడవ్వడం, బాత్‌రూంలలో గొట్టాలు విరిగి ఉండడాన్ని గుర్తించారు. వెంటనే హెచ్ఎం కామేశ్వరరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. రూరల్ ఎస్ఐ ప్రయోగమూర్తి పాఠశాలకు చేరుకుని పరిశీలించారు. విచారణ చేపట్టారు.

రైతు చెంతకు పరిశోధన ఫలితాలు

- ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిశోధన సంచాలకురాలు ప్రశాంతి



మాట్లాడుతున్న పరిశోధన వ్యవసాయ సంచాలకురాలు ప్రశాంతి

పార్వతీపురం: రైతులు అధిక దిగుబడి, ఆదాయం పొందేందుకు వారికి పరిశోధన ఫలితాలు ఉపయోగపడతాయని ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిశోధన సంచాలకురాలు ఎల్.ప్రశాంతి తెలిపారు. గురుగుబిల్లి మండలంలోని ఉద్యాన కళాశాలలో బుధవారం ఉన్నత పర్వత శ్రేణి గిరిజన మండల పరిశోధన మరియు విస్తరణ సలహా మండలి సమావేశం నిర్వహించారు. పరిశోధన సంచాలకురాలు ఎల్.ప్రశాంతి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ చింతపల్లి, సీతంపేట, రస్తాకుటుంబాయి పరిశోధనా కేంద్రాలలో అధిక దిగుబడినిచ్చే నూతన వంగడాలు, తెగుళ్ల నివారణ, సేంద్రీయ వ్యవసాయ పద్ధతులపై పరిశోధనలు జరుగుతున్నాయని, పరిశోధన ఫలితాలను రైతులకు అందించి వారు మంచి ఫలితాలు సాధించేందుకు రైతులను ఈ కార్యక్రమంలో భాగస్తులను చేస్తున్నట్లు తెలిపారు. సేంద్రీయ సాగును ప్రోత్సహించాలని, సేంద్రీయ పంటలకు సర్టిఫికేషను చేసి మార్కెటు విలువ పెరిగే విధంగా ప్రోత్సహించాలన్నారు. రసాయన ఎరువులు పరిమితికి మించి వాడకూడదని, భూ పరీక్షలు నిర్వహించి శాస్త్రవేత్తలు సూచించిన మోతాదులోనే వినియోగించాలన్నారు. గిరిజన ప్రాంతాలలో సేంద్రీయ విధానంలో పండించే పంటలను విలువ ఆధారిత ఉత్పత్తులుగా మార్చి అమ్మడం ద్వారా వారికి అధిక ఆదాయం వస్తుందని తెలిపారు. రైతులకు ఎక్కువ ఆదాయం రావాలంటే డిమాండు గల పంటలను పండించాలని చింతపల్లిలో విదేశీ పూల సాగుపై పరిశోధనలు సాగుతున్నాయని, కొన్ని రకాల పూలను వాణిజ్య సరళిలో పండించుటకు రైతులను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. గిరిజన ప్రాంతాలలో ప్రధాన పంటలైన రాజ్ మా వంటి పంటలలో అధిక దిగుబడినిచ్చే వంగడాలను రైతులకు అందిస్తున్నట్లు తెలిపారు. అగ్రి టూరిజం అభివృద్ధి చేయాలని, విద్యార్థులకు వ్యవసాయ క్షేత్రాలు సందర్శించే ఏర్పాట్లు చేయాలని, పాఠ్యాంశంగా చేర్చాలన్నారు. చింతపల్లి పరిశోధనా కేంద్రం అసోసియేట్ డైరెక్టర్ ఎం.సురేష్‌కుమార్ మాట్లాడుతూ చింతపల్లి, సీతంపేట, రస్తాకుంటుంబాయి పరిశోధనా కేంద్రాలలో నిర్వహిస్తున్న పరిశోధనలు గురించి వివరించారు. రాజ్ మా, కందిలో అధిక దిగుబడి నిచ్చే నూతన వంగడాలు ప్రవేశ పెట్టినట్లు తెలిపారు. మార్కెటులో డిమాండు గల విదేశీ పూల సాగును వాణిజ్య సరళిలో పండించేందుకు రైతులను ప్రోత్సహిస్తున్నామని, ఇప్పటికే ఔత్సాహికులైన కొందరు రైతులు ప్రయోగాత్మకంగా పండిస్తున్నారన్నారు. చింతపల్లి పరిశోధనా కేంద్రంలో గ్లాడియోలస్, చైనా ఆస్టర్, బంతి, లిలియం, జెర్బరా పూలు పండిస్తున్నామని, కొత్తగా తులిప్ పూలను సాగు చేసి జాతీయ స్థాయిలో గుర్తింపు సాధించడం జరిగిందన్నారు. ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు ఎ.సుబ్బరామిరెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ కూలీల కొరతను ఎదుర్కొంటున్న ప్రస్తుత పరిస్థితులలో వ్యవసాయంలో యాంత్రీకరణ, నూతన వ్యవసాయ విధానాలను విస్తరించవలసిన అవసరం ఉందన్నారు. ప్రతి జిల్లాకు ఒక రైతు శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. శాస్త్రవేత్తలు పి.సీతారాం, పి.శ్రీనివాసరాజు, పి.జోగారావు, ఎం.అనంత విహరి, ఎస్.వంశీకృష్ణ, ఎం.శ్రీనివాసరావు, సౌజన్య, పి.వెంకటరావు, జి.చిట్టిబాబు, అను తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు



పార్టీ కార్యాలయంలో కేక్‌ను కట్ చేస్తున్న ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య దంపతులు

గజపతినగరం : వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ముందుగా విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ ఎమ్మెల్యే అప్పలనరసయ్యను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్, నారాయణమూర్తిరాజు, ప్రభూజీరాజుతో పాటు గజపతినగరం, దత్తిరాజేరు, బొండపల్లి, గంట్యాడ, జామి మండలాల జెడ్పీటీసీలు, ఎంపీపీలు, మండల పార్టీ అధ్యక్షులు, కార్యకర్తలు, అభిమానులు పార్టీ కార్యాలయానికి చేరుకొని ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సుమారు 60 కేజీల కేక్‌ను ఎమ్మెల్యే అప్పలనరసయ్య, సతీమణి దేవి అనురాధ కట్ చేశారు. అందరికీ పంచిపెట్టారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గార తవుడు, బెల్లాన త్రినాధరావు, మండల సురేష్, బూడి వెంకటరావు, కరణం ఆదినారాయణ, ఏఎంసీ చైర్మన్ వేమలి ముత్యాలనాయుడు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య దంపతులను పూలదండతో సత్కరిస్తున్న ఐదు మండలాల నేతలు, అభిమానులు

దత్తిరాజేరు: స్థానిక ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య పుట్టిన రోజు వేడుకలు గజపతినగరం క్యాంపు కార్యాలయంలో బుధవారం జరిగాయి. ఎంపీపీ గేదెల సింహాద్రి అప్పలనాయుడు, జెడ్పీటీసీ రౌతు రాజేశ్వరి, వైస్ ఎంపీపీలు బమ్మిడి అప్పలనాయుడు, మిత్తిరెడ్డి రమేష్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మంత్రి అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు కడుబండి రమేష్‌నాయుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు సుమల శ్రీను ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

విజయనగరం సునాయాస విజయం

- అండర్– 23 విభాగంలో శ్రీకాకుళం జట్టుపై 9 వికెట్ల తేడాతో గెలుపు
- సర్ విజ్జీ మైదానంలో ఏసీఏ ఆధ్వర్యంలో అంతర్ జిల్లాల వన్డే టోర్నీ ప్రారంభం



ఎం.రవికిరణ్



దుర్గాప్రశాంత్

విజయనగరం/విజయనగరం రూరల్: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సర్ విజ్జీ మైదానంలో బుధవారం ప్రారంభమైన అంతర్ జిల్లాల అండర్ – 23 పురుషుల వన్డే టోర్నీలో శ్రీకాకుళం జట్టుపై విజయనగరం జట్టు విజయం సాధించి బోణీ చేసింది. విజయనగరం, శ్రీకాకుళం జట్ల మధ్య జరిగిన వన్డే మ్యాచ్‌లో టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్ ప్రారంభించిన శ్రీకాకుళం జట్టును విజయనగరం జట్టు బౌలర్లు ఎం.రవికిరణ్ (8 ఓవర్లలో 5 వికెట్లు), దుర్గాప్రశాంత్ (10 ఓవర్లలో 4 వికెట్లు) కట్టడి చేశారు. వీరిద్దరూ పోటాపోటీగా వికెట్లు పడగొట్టడంతో శ్రీకాకుళం జట్టు 22.2 ఓవర్లలో 73 పరుగులకే ఆలౌటైంది. ఆ జట్టు మొత్తం స్కోర్ కంటే ఎక్స్‌ట్రాల రూపంలో వచ్చిన పరుగులే (30) అత్యధికం కావడం విశేషం. ఆ జట్టు మిడిలార్డర్ బ్యాటర్ మహమూద్ ఒక్కడే (14 పరుగులు) రెండంకెల స్కోర్ సాధించడం విశేషం. అనంతరం స్వల్ప లక్ష్య చేధనలో బ్యాటింగ్‌కు దిగిన విజయనగరం జట్టు కేవలం 10.4 ఓవర్లలో 77 పరుగులు సాధించి ఘన విజయాన్ని అందుకుంది. ఆ జట్టు ఓపెనింగ్ బ్యాటర్లు సాయి సందీప్ (21 బంతుల్లో 14 పరుగులు), ఎస్.హరీష్ (32 బంతుల్లో 21 పరుగులు నాటౌట్) తొలి వికెట్‌కు 41పరుగులు సాధించగా, ఫస్ట్ డౌన్‌లో వచ్చిన కెప్టెన్ జె.దుర్గాకుమార్ ధాటిగా ఆడి (14 బంతుల్లో 4 ఫోర్లు, రెండు సిక్సర్ల సాయంతో 31 పరుగులు నాటౌట్) మ్యాచ్‌ను ముగించాడు.



దుర్గాకుమార్

వైద్య విద్యార్థులకు గాయాలు

లక్కవరపుకోట : మండలంలోని అరకు – విశాఖ రోడ్డు ఎల్.కోట పాత బస్టాప్ సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న బ్రిడ్జి వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కాకినాడ రంగరాయ మెడికల్ కళాశాలకు చెందిన వైద్య విద్యార్థులు పలువురు గాయాల పాలయ్యారు. మహమద్ నవాజ్, జి.చిన్మయిలు రంగరాయ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ అభ్యసిస్తున్నారు. వీరు విశాఖపట్నంలో ఒక ద్విచక్ర వాహనాన్ని అద్దెకు తీసుకొని అరకు అందాలు చూసేందుకు వెళ్తుండగా ద్విచక్ర వాహనం అదుపు తప్పి పడిపోయారు. దీంతో వీరు తీవ్ర గాయాలు కాగా స్థానికుల సహాయంతో ఎల్.కోట పీహెచ్‌సీకి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యం కోసం ఎస్.కోట సీహెచ్‌సీకి తరలించారు.

జగనన్నను మళ్లీ సీఎంను చేద్దాం..

- ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర



ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొరకు స్వాగతం పలుకుతున్న ప్రజలు, నాయకులు

సాలూరు: ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ఆశీర్వదించి రానున్న ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రిగా చేయాలని ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర కోరారు. మండలంలో తుండ పంచాయితిలో తుండ, ఇటికివలస, జోడిమామిడివలస, ఒడ్డువలస, తాడివలస గ్రామాల్లో ఎంపీడీఓ పార్వతి ఆధ్వర్యంలో సర్పంచ్ సీదరపు నూకయ్య, ఎంపీటీసీ మర్రి ఆదయ్యల అధ్యక్షతన బుధవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఉప ముఖ్యమంత్రి రాజన్నదొరకు థింసా నృత్యాలు, మేళతాళాలు, బాణసంచాలతో ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి ప్రతి ఇంటికి వెళ్లి జగనన్న పాలనలో పథకాల ద్వారా ఎంత లబ్ధి చేకూరిందో వివరించారు. ఒడ్డువలస, తాడివలస, ఇటివలస గ్రామస్తులు బీటీ రోడ్డు కావాలని కోరారు. తాడివలసలో తాగునీటి ట్యాంక్ ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా అత్యంత పారదర్శకంగా అవినీతి రహితంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని వివరించారు. గిరిజనులకు అండగా నిలుస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్, ఏఎంసీ చైర్‌పర్సన్ దండి అనంతకుమారి, వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, దండి శ్రీనివాసరావు, పీడిక సుదర్శనదొర, సువ్వాడ రామకృష్ణ, భరత్‌శ్రీనివాస్, బీసు, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

భోగాపురం: మండలంలోని తూడెం గ్రామానికి చెందిన నీలాపు సత్యం(62) తగరపువలస ఎన్ఆర్ఐ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం అర్ధరాత్రి మృతి చెందినట్టు ఎస్ఐ కృష్ణమూర్తి తెలిపారు. మృతుని బంధువులు, పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని తూడెం గ్రామానికి చెందిన నీలాపు సత్యంకు భార్య అప్పలకొండతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. సత్యం మందుకు బానిస కావడంతో అతని ఆరోగ్యం దెబ్బతింది. దీంతో సత్యం ప్రతిరోజు మందులు వాడుతున్నాడు. ఈ క్రమంలో సోమవారం సాయంత్రం సత్యం మద్యం సేవించి ఇంటికి వచ్చాడు. ఆరోగ్యం బాగోలేదు కదా మళ్లీ ఎందుకు మందు తాగావంటూ భార్య అప్పలకొండ భర్తను నిలదీసింది. దీంతో సత్యం మనస్తాపానికి గురై ఇంటికి 100 మీటర్ల దూరంలో ఉన్న పశువుల శాల వద్దకు వెళ్లి పురుగుల మందు సేవించాడు. చీకటి పడుతున్న భర్త ఎంతకీ ఇంటికి రాకపోవడంతో భార్యకు అనుమానం వచ్చి పశువుల శాల వద్దకు వెళ్లింది. అప్పటికే భర్త పురుగుల మందు తాగి వాంతులు చేసి అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. దీంతో భార్య అప్పలకొండ కుటుంబ సభ్యులతో కలిసి ఆటోలో భర్తను తగరపువలస ఎన్ఆర్ఐ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సత్యం మంగళవారం అర్ధరాత్రి మృతి చెందాడు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

ఆర్మీ జవాన్...



నగరపు అరుణ్‌కుమార్ (ఫైల్)

పాలకొండ రూరల్: మండలంలోని అవలంగి గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ నగరపు అరుణ్‌కుమార్ (36) అరుణాచల్‌ప్రదేశ్‌లో డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తూ ఈ నెల 24న తీవ్ర అస్వస్థతకు గురై మృతి చెందాడు. గడిచిన 14 ఏళ్లుగా విధుల్లో ఉన్న అరుణ్‌కుమార్ మరణ వార్త ఉన్నతాధికారులు తమకు తెలియజేశారని కుటుంబ సభ్యులు తెలిపారు. మృతదేహం ఇంకా రావాల్సి ఉంది. మృతునికి భార్య రోజాకుమారితో పాటు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

‘కోట’లో తెలుగు తమ్ముళ్ల కుమ్ములాట

- గంట పాటూ ఉద్రిక్తత
- సర్ది చెప్పిన పోలీసులు
- గొంపను అడ్డుకున్న తమ్ముళ్లు



ఇరు వర్గాల దేశం నేతలకు సర్ది చెబుతున్న ఎస్ఐ

శృంగవరపుకోట: కొంత కాలంగా వర్గాల కుమ్ములాటలతో రగిలిపోతున్న తెలుగుదేశం కుంపటి ఒక్కసారిగా రాజుకుంది. ఇన్నాళ్లూ చాపకింద నీరులా ఉన్న వర్గపోరు ఒక్కసారిగా పెల్లుబికింది. బుధవారం సాయంత్రం 7గంటలకు శృంగవరపుకోట పట్టణంలో శ్రీనివాసకాలనీలో ‘ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి’ కార్యక్రమాన్ని పార్టీ యువనేత గొంప కృష్ణ ప్రారంభించారు. స్థానిక షిర్డీసాయి గుడి వద్ద పూజా కార్యక్రమాలు చేసిన గొంప కృష్ణ, చిప్పాడ రమణాజీ, సత్యం, చిరంజీవి, రాయవరపు చంద్రశేఖర్, మంగరాజు తదితర కార్యకర్తలతో కలసి శ్రీనివాసకాలనీలో ప్రచారానికి సిద్ధమయ్యారు. అదే సమయంలో ఎస్.కోట పట్టణానికి చెందిన తెలుగుదేశం వార్డు సభ్యులు, నాయకులైన మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి వర్గీయులు నానిగిరి రమణాజీ, సి.హెచ్.కిరణ్, పి.రాజు, కె.వాసు, వాకాడ బాలు తదితరుల సమక్షంలో కార్యకర్తలు ఏకమై గొంప కృష్ణ వర్గాన్ని శ్రీనివాసకాలనీలోకి రాకుండా అడ్డుకున్నారు. దీంతో రెండు వర్గాల మధ్య తీవ్ర వాగ్యుద్ధం మొదలైంది. పార్టీ కోసం పార్టీ పెద్దల ఆదేశాలకు అనుగుణంగా పార్టీ కార్యక్రమాలు చేస్తున్నామని, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలం, నాయకులమని చెప్పుకుంటూ పార్టీ కార్యక్రమాలను ఎలా అడ్డుకుంటారని గొంప కృష్ణ వర్గీయులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇందుకు ప్రతిగా పూర్వం నుంచి పార్టీ కోసం త్యాగాలు చేసి, రాజకీయం కోసం ఆస్తులు అమ్ముకుని పార్టీని నిలబెట్టిన కార్యకర్తల్ని పట్టించుకోకుండా వదిలేసి, కొత్తగా వచ్చి, పార్టీని వర్గాలుగా చీల్చేసే నాయకుల్ని ఎలా రానిస్తాం.. ఇలాంటి తప్పుడు రాజకీయాలు చేస్తే పార్టీనీ నమ్ముకున్న కార్యకర్తలు ఏమౌతారంటూ వాదనకు దిగారు. గొంప కృష్ణ వీరికి నచ్చచెప్పే యత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది. దీంతో తీవ్ర గందరగోళం ఏర్పడింది. రోడ్డు మీద రెండు వర్గాలు కుమ్ములాడుకున్నారు. దీంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి ఇరువర్గాలకు నచ్చజెప్పారు. రోడ్డు మీద పంచాయతీలను అనుమతించేది లేదని, ట్రాఫిక్‌కు ఇబ్బంది పెడితే కేసులు పెడతామని హెచ్చరించారు. ఇరు వర్గాల వారు కూర్చుని సమన్వయం చేసుకోవాలని సూచించారు. రెండు వర్గాల నాయకుల అభ్యంతరాలు, వాదనలతో ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఎట్టకేలకు గొంప కృష్ణ వర్గీయులు శ్రీనివాసకాలనీలోకి వెళ్లే ఆలోచన విరమించుకుని దేవీ జంక్షన్ వైపు వెళ్లటంతో గొడవ సద్దు మణిగింది.



శ్రీనివాసకాలనీ ఎదుట రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న లలితకుమారి వర్గీయులు

ఔరా.. అనిపించేలా...



రామభద్రపురంలోని మొదటి దశలో 20 గదులతో రూపుదిద్దుకున్న ఉన్నత పాఠశాల



బూసాయవలస కేజీబీవీ ఆవరణలో అదనపు తరగతి గదుల నిర్మాణం



పాడివానివలస ప్రాథమిక పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణాన్ని పరిశీలిస్తున్న నాడు - నేడు డీఈఈ జగ్గారావు

రాష్ట్రంలోని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక పాఠశాలల రూపురేఖలే మారిపోయాయి. నాడు – నేడు ద్వారా కార్పొరేట్ పాఠశాలలను తలదన్నేలా తీర్చిదిద్ది ఔరా.. అనిపిస్తున్నారు. సకల సదుపాయాలతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా చర్యలు చేపట్టారు. రామభద్రపురం మండలంలో నాడు – నేడు మొదటి విడతలో 25 పాఠశాలలను ఎంపిక చేసి సుమారు రూ.4.50కోట్లు వెచ్చించి ఔరా.. అనిపించారు. ప్రస్తుతం రెండో విడతలో మరో 21 పాఠశాలల్లో అదనపు తరగతి గదులతో పాటు మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపట్టారు. ఈ పనులు జోరుగా సాగుతున్నాయి. రెండో విడతలో ఇప్పటి వరకు రూ.1.50కోట్లు ఖర్చు చేసినట్టు సమాచారం. మొత్తంగా జగనన్న పాలనలో మారుతున్న బడులను చూసి ఇటు విద్యార్థులు, అటు తల్లిదండ్రులు మురిసిపోతున్నారు.

– రామభద్రపురం

రైతున్నకు యంత్ర సాయం

విజయనగరం ఫోర్ట్:



సీహెచ్‌సీలకు అందించిన ట్రాక్టర్లు

వ్యవసాయ రంగానికి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోంది. విత్తనాల నుంచి పంట కొనుగోలు వరకు రైతులకు సహకారం అందిస్తోంది. ఏటా వైఎస్సార్ రైతు భరోసా కింద రూ.13,500 చొప్పున పెట్టుబడి సాయం రైతుల ఖాతాలకు జమ చేస్తోంది. ఆధునాతన పద్ధతిలో వ్యవసాయం చేసేందుకు అవసరమైన యంత్ర పరికరాలను రాయితీపై అందిస్తోంది. సాగులో యాంత్రీకరణను ప్రోత్సహిస్తోంది. వ్యవసాయంలో కూలీల కొరతను, సమయాన్ని, సాగు ఖర్చును తగ్గించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రైతుభరోసా కేంద్రాల ద్వారా యంత్రాలను సమకూర్చుతోంది. ప్రభుత్వం ఇచ్చిన ప్రోత్సాహంతో రైతులు ఉత్సాంగా ముందుకు ‘సాగు’తున్నారు.

జిల్లాలో 500 కస్టమ్ హైరింగ్ సెంటర్లు

జిల్లాలో 500 కస్టమ్ హైరింగ్ సెంటర్లు(సీహెచ్‌సీలు) ఉన్నాయి. ఒక్కో సెంటర్‌లో ఐదుగురు రైతులతో కూడిన గ్రూపును ఏర్పాటు చేశారు. గ్రూపులో ఉన్న సభ్యులు తమకు నచ్చిన వ్యవసాయ పనిముట్లను ఎంపిక చేసుకుని ప్రభుత్వం నుంచి రాయితీపై పొందవచ్చు. ఇప్పటివరకు 328 కస్టమ్ హైరింగ్ సెంటర్లు (సీహెచ్‌సీ)లకు యంత్ర పరికరాలను ప్రభుత్వం సరఫరా చేసింది. దీనికోసం రాయితీ రూపంలో రూ.9 కోట్ల నిధులు వెచ్చించింది. ఇంకా మిగిలి ఉన్న 172 సీహెచ్‌సీలకు యంత్ర పరికరాలు అందించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. వీటిలో 126 సీహెచ్‌సీల పరిధిలోని రైతులు తమకు కావాల్సిన యంత్ర పరికరాల కోసం తమ వాటా చెల్లించారు. వీరికి రాయితీరూపెన ప్రభుత్వం రూ.3 కోట్లు చెల్లించనుంది. మిగిలిన 36 సెంటర్లు యంత్ర పరికరాలు తీసుకునేలా వ్యవసాయ అధికారులు చర్యలు చేపడుతున్నారు. 84 మంది ఇప్పటి వరకు ట్రాక్టర్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు.

సీహెచ్‌సీల్లో అందించే పరికరాలు:

రైతులు సూచించిన కంపెనీలకు చెందిన వ్యవసాయ పనిముట్లనే ప్రభుత్వం సరఫరా చేస్తోంది. ట్రాక్టర్లు, పవర్ టిల్లర్, స్ప్రేయిర్, మినీ ట్రా క్టర్, కల్టివేటర్ వంటి పరికరాలను ప్రభుత్వం రాయితీపై అందజేస్తోంది. వీటిని పొందిన రైతు గ్రూపులు మిగిలిన రైతులకు అద్దె ప్రాతిపదికన ఇచ్చుకోవచ్చు.

క్లుప్తంగా

29న జిల్లా జూనియర్స్ సాఫ్ట్‌బాల్ జట్ల ఎంపిక

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా జూనియర్స్ బాలబాలికల జట్ల ఎంపికలు ఈ నెల 29న జరగనున్నాయని జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కలిదిండి నరసింహరాజు, ప్రధాన కార్యదర్శి సిగిలిపల్లి లక్ష్మీదేవి తెలిపారు. శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానం వేదికగా శనివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి ఎంపికల ప్రక్రియ జరుగుతుందని పేర్కొన్నారు. 2006 జనవరి ఒకటి తర్వాత జన్మించిన వారు అర్హులని తెలిపారు. పూర్తి వివరాలకు సంఘ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి ఎం.వి.రమణ (94410 11391)ను సంప్రదించాలని వారు కోరారు.

సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం



సమావేశంలో పాల్గొన్న ఒడియా మైనారిటీ సంఘం ప్రతినిధులు

ఇచ్ఛాపురం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటామని ఆంధ్రప్రదేశ్ ఒడియా మైనారిటీ సంఘం అధ్యక్షుడు సత్యనారాయణ పాడీ అన్నారు. ఇచ్ఛాపురం పట్టణంలోని బాపూజీ ఒడియా పాఠాఘూర్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒడియా మాతృభాషగా గల కంఢ్ర కులస్తులను బీసీ–డీ నుంచి బీసీ–ఏగా మార్చిన సీఎంకు, స్పీకర్, మంత్రులు, ఎమ్మెల్సీ, నియోజకవర్గ సమన్వయకర్తలకు ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పాఠాఘూర్ అధ్యక్షుడు రఘునాథ్ గౌడో, మైనారిటీ సంఘ ప్రతినిధులు శివప్రసాద్ పండా, రాజేంద్రపండా, శ్రీనివాస్‌దాస్, రఘునాథ్ శస్మాల్, కేశవబెహర పాల్గొన్నారు.

ఆర్టీసీలో డ్రైవింగ్ శిక్షణ ప్రారంభం



అభ్యర్థికి ట్రెనింగ్ బుక్ అందజేస్తున్న డీఎం మాధవ్

శ్రీకాకుళం అర్బన్: ఆర్టీసీలో డ్రైవింగ్ శిక్షణ భవిష్యత్తుకు బంగారు బాట అని శ్రీకాకుళం ఒకటో డిపో మేనేజర్ కె.మాధవ్ అన్నారు. ఏపీఎస్ఆర్టీసీ హెవీ డ్రైవింగ్ స్కూల్‌లో 12వ బ్యాచ్‌ను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ఇప్పటివరకు సుమారు 200 మంది అభ్యర్థులు శిక్షణ తీసుకున్నారని, వారిలో చాలామంది ఉపాధి అవకాశాలు పొంది స్థిరపడ్డారన్నారు. ఆర్టీసీతో పాటు మిగతా డిపార్ట్‌మెంట్లలో ఉద్యోగ అవకాశాలు ఉంటాయన్నారు. తదుపరి బ్యాచ్ వివరాల కోసం 9963091999, 7382921920 నంబర్లను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్టీసీ డ్రైవింగ్ ఇన్‌స్ట్రక్టర్ వర్మ పాల్గొన్నారు.

పక్కదారి పడుతున్న అంగన్‌వాడీ సరుకులు



సిబ్బందిని ప్రశ్నిస్తున్న గొండు సీతారాం

పొందూరు: అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు, గర్భిణులకు, బాలింతలకు అందించాల్సిన సరుకులు పక్కదారి పడుతున్నట్లు రికార్డుల పరిశీలనలో వెల్లడవుతుండడం అధికారుల పర్యవేక్షణ లోపాన్ని తేటతెల్లం చేస్తోందని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు డాక్టర్ గొండు సీతారాం అన్నారు. పొందూరు మండలం కింతలిలో అంగన్‌వాడీ–1, అంగన్‌వాడీ–3 కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీలు చేశారు. పిల్లలు రాకపోయినా హాజరైనట్లు లెక్కల్లో చూపడం, వీరికి పౌష్టికాహారం అందిస్తున్నట్లు చూపడంపై విస్మయం చెందారు. పక్క ఇంట్లో వండిన పదార్థాలను తీసుకొచ్చి వడ్డించే ప్రయత్నంపైనా ఆగ్రహం వ్యక్తం చేశారు. సూపర్‌వైజర్ జీవీ రత్నం సెంటర్లు పరిశీలించిన దాఖలాలు లేకపోవడం గుర్తించారు. రికార్డుల నిర్వహణ సక్రమంగా లేకపోవడం, ఈ నెల 30 వరకు విద్యార్థుల హాజరు, సరుకుల పంపిణీకి సంబంధించిన చార్టులో అందినట్లు వివరాలు పొందపరచడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బాలల హక్కులకు, సంక్షేమానికి భంగం వాటిల్లితే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. తనిఖీల్లో పంచాయతీ సెక్రటరీ సారంగి నాగరాజు, వార్డు మహిళా సంరక్షణాధికారి పైడి అశ్విని, సీఆర్‌పీఎఫ్ కన్వీనర్ కొత్తకోట శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

104 రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా లోకనాథం



బమ్మిడి లోకనాథం

కాశీబుగ్గ : సంచార 104 వాహనంలో పని చేస్తూ పేదల ఆరోగ్యం కోసం పాటుపడుతున్న సిబ్బంది సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని 104 సంఘ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా నియమితుడైన బమ్మిడి లోకనాథం బుధవారం తెలిపారు. విజయవాడలోని ఎంబీ విజ్ఞాన్ కేంద్రంలో 104 ఉద్యోగుల రాష్ట్ర సమావేశం నిర్వహించి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఇందులో శ్రీకాకుళం జిల్లా పలాసకు చెందిన బమ్మిడి లోకనాథంను రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించారు.

రూ.123 కోట్లతో
శాశ్వత తాగునీటి సౌకర్యం

- మున్సిపల్ ఇంజినీర్లతో మంత్రి ధర్మాన సమీక్ష

శ్రీకాకుళం రూరల్:

శ్రీకాకుళం నగర జనాభా సుమారు రెండు లక్షలు ఉందని, రానున్న ఇరవై ఏళ్లను ఉంచుకుని శాశ్వత ప్రాతిపదికన తాగునీటి సౌకర్యం కల్పించేందుకు రూ.123 కోట్లతో డీపీఆర్‌ను రూపొందించినట్లు సిస్ట్ కన్సల్టెన్సీ ప్రతినిధులు మంత్రి ధర్మాన ప్రసాదరావుకు వివరించారు. నగరాభివృద్ధికి సంబంధించి పలు అంశాలపై మంత్రి ధర్మాన బుధవారం మున్సిపల్ అధికారులతో పెదపాడులోని క్యాంపు కార్యాలయంలో సమీక్షించారు. ఇటీవల నగరంలో విలీనమైన ఏడు పంచాయతీలకు సంబంధించి తాగునీటి సౌకర్యాన్ని శాశ్వత రీతిలో అభివృద్ధి చేసేందుకు పలు సూచనలు చేశారు. వాటర్ సప్లయ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రాజెక్టుకు సంబంధించి డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టును రూపొందించిన సంస్థ ప్రతినిధులతో మంత్రి చర్చించారు.

రానున్న రోజుల్లో 16 ఎంఎల్‌టీ తాగునీరు అందించేలా డీపీఆర్ రూపొందిపరిచినట్లు చెప్పారు.



మున్సిపల్ అధికారులతో మాట్లాడుతున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

ఆదివారంపేట ఎగువ ప్రాంతంలో పది ఎంఎల్‌టీలకు సంబంధించి వాటర్ వర్క్స్ జరుగుతోందని, మరో ఐదు ఎంఎల్‌టీలకు బలగలో పనులు జరుగుతున్నాయన్నారు. త్వరితగతిన వీటిని పూర్తి చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. విలీన పంచాయతీలకు రెండు పూటలా నీరు అందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం తరఫున అమృత్ అమలులో భాగంగా రూ.23 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. పెదపాడు పంచాయతీ పరిధిలో సమస్యాత్మకంగా ఉన్న ప్రాంతంలో ఓవర్ హెడ్ ట్యాంక్ ఏర్పాటు చేయనున్నట్లు మంత్రికి మున్సిపల్ అధికారులు వివరించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ చల్లా ఓబులేషు, మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు గంగాధర్, పబ్లిక్‌హెల్త్ ఇంజనీర్ సుగుణాకర్, చల్లా శ్రీనివాస్ పాల్గొన్నారు.

పోర్టుతో వలసలకు చరమగీతం

- అభివృద్ధికి మూలస్తంభం మూలపేట
- విలేకరులతో మంత్రి సీదిరి అప్పలరాజు



మాట్లాడుతున్న మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు

కాశీబుగ్గ: శ్రీకాకుళం అంటే మొదట గుర్తొచ్చేది వలసలేనని, ఆ పరిస్థితిని మార్చేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మూలపేట వంటి పోర్టులకు శ్రీకారం చుట్టారని రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. బుధవారం పలాసలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. సిక్కోలు వాసులు ఇక్కడే ఉపాధి పొందాలనే ఉద్దేశంతో ఇటీవల జిల్లాలో మూడు భారీ ప్రాజెక్టులకు సీఎం శంకుస్థాపన చేశారని గుర్తు చేశారు. రాబోయే రోజుల్లో మూలపేట గొప్పగా అభివృద్ధి చెందుతుందని, అభివృద్ధికి మూలస్తంభంగా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పోర్టుతో జిల్లా ముఖచిత్రం మారి ముంబై, చెన్నై, విశాఖపట్నం వంటి నగరాలకు దీటుగా అభివృద్ధి చెందుతుందని అభిప్రాయపడ్డారు. సుమారు 35 వేల మందికి ఉద్యోగ అవకాశాలు రానున్నాయని చెప్పారు. బుడగట్లపాలెం ఫిషింగ్ హార్బర్‌తో మత్స్యకారులు చెన్నై, గుజరాత్ వంటి ప్రాంతాలకు వలసలు వెళ్లే పరిస్థితి ఉండదన్నారు. హార్బర్‌కు అనుసంధానంగా ప్రోసెసింగ్ పరిశ్రమలు వస్తాయని, జిల్లా మొత్తం ఫిష్ ఆంధ్ర ఔట్‌లెట్స్ వస్తాయని చెప్పారు. వంశధార లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ ద్వారా జిల్లాలో నీటిపారుదల రంగానికి ఆనాడు వైఎస్సార్ ఊపిరి పోస్తే దానికి కొనసాగింపుగా ఆయన తనయుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గొట్టా బ్యారేజ్ నుంచి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం ద్వారా సాగునీరు అందించి రెండు పంటలకు అవకాశం కల్పిస్తున్నారని గుర్తు చేశారు. ఉద్దానంలో నిర్మిస్తున్న రూ.700 కోట్ల వాటర్ ప్రాజెక్టు తాగునీటి అవసరాలు తీరుస్తుందన్నారు. ఉత్తరాంధ్రకు సంబంధించి సాలూరులో ఏర్పాటు చేస్తున్న ట్రైబల్ యూనివర్సిటీ గిరిజనుల అభ్యున్నతికి దోహదపడుతుందన్నారు.

శిక్షణతో స్వయం ఉపాధి

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రభుత్వం అందించే శిక్షణను సద్వినియోగం చేసుకుని యువత స్వయం ఉపాధి సాధించాలని, తద్వారా పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ కె.రామారావు అన్నారు. ప్రధానమంత్రి అనుసూచిత జాతి అభ్యుదయ యోజనలో భాగంగా బుధవారం నగరంలోని బాపూజీ కళామందిర్‌లో ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలో రాగ్ పిక్కర్స్ (ప్లాస్టిక్, చెత్త, ఇతర వ్యర్థ పదార్థాలు) సేకరించిన వ్యర్థాలను గ్రేడింగు చేయడం, రీ సైక్లింగ్ వేల్యూ ఎడిషన్‌కు అమ్మడం ద్వారా అధిక ఆదాయం పొందవచ్చునని చెప్పారు. శిక్షణను యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎస్సీ కార్పొరేషన్, మెప్మా, సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రో కెమికల్స్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు రమణమూర్తి, బి.నరసింగరావు, మోహర్వాని, అర్జీ కోటి, పి.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రామారావు

చేనేత సహకార సంఘాలకు బకాయిలు చెల్లించాం

- ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): చేనేత సహకార సంఘాలకు బకాయిలు చెల్లింపులు పూర్తి చేసి నేత కార్మికులకు ప్రభుత్వం అన్నివిధాలా అండగా నిలుస్తోందని ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి అన్నారు. రాష్ట్ర వ్యాప్త పర్యటనలో భాగంగా బుధవారం ఆప్కో డైరెక్టర్ ఎ.వై.సుబ్బారెడ్డితో కలిసి శ్రీకాకుళంలో పర్యటించారు. ముందుగా ప్రజాబంధు ప్రగాఢ కోటయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల చేనేత, జౌళి శాఖ, మండల వాణిజ్య అధికారులతో సభ నిర్వహించి కార్మికుల సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేనేత పెట్టుబడులు, సామగ్రి అందజేయడమే కాకుండా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పెన్షన్ అందజేస్తున్నట్లు తెలిపారు. 2018 నుంచి శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లోని ప్రాథమిక చేనేత సహకార సంఘాలలో పనిచేస్తూ మరణించిన 98 మంది చేనేత కార్మికులకు సంబంధించి ఒక్కొక్కరికీ రూ.12,500 చొప్పున ఎక్స్‌గ్రేషియా చెక్కుల పంపిణీ చేశారు. ఈ ఎక్స్‌గ్రేషియా 2023 నుంచి రూ.25,000కు ప్రభుత్వం పెంపుదల చేసిందన్నారు. ఆప్కో ద్వారా నూలు పంపిణీ చేసేందుకు, డ్రయ్యింగ్ చార్జీలు పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. వైఎస్సార్ నేతన్న నేస్తం పథకం ప్రాథమిక చేనేత సహకార సంఘాల్లోని వర్క్‌షెడ్‌ల్లో పనిచేస్తున్న కార్మికులకు కూడా వర్తించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. సమావేశంలో చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకులు ఐ.ధర్మారావు, ఆప్కో డివిజనల్ వాణిజ్యాధికారి సోమేశ్వరరావు, డీఓ శేఖర్, లీలాకుమార్ ముఖర్జీ, వివిధ సహకార ఉత్పత్తి విక్రయసంఘాల అధ్యక్షులు, మేనేజర్లు, సేల్స్‌మెన్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి

జలుమూరు తహసీల్దార్ కార్యాలయంలో ఏసీబీ తనిఖీలు

జలుమూరు: ఏసీబీ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తహసీల్దార్, రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో తనిఖీలు నిర్వహించి తుది నివేదిక అందజేస్తామని ఏసీబీ సీఐ కె.భాస్కరరావు అన్నారు. జలుమూరు తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం తనిఖీలు నిర్వహించి ప్రభుత్వ సేవలు అనుకున్న సమయానికి పారదర్శకంగా అందుతున్నాయా లేదా అన్నది పరిశీలన చేశామని తెలిపారు. అనంతరం కొన్ని పెండింగ్ ఫైల్స్ వివరాలు తహసీల్దార్‌తో చర్చించామని చెప్పారు. రాష్ట్ర కార్యాలయానికి 14400 నంబర్‌కు వచ్చిన ఫోన్ ఆధారంగా వివరాలు సేకరించామని చెప్పారు. ఈ సేవలను ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. ఆయనతోపాటు ఎస్.ఐ సత్యారావు, సిబ్బంది ఉన్నారు.



జలుమూరు తహసీల్దార్‌తో మాట్లాడుతున్న ఏసీబీ సీఐ భాస్కరరావు సిబ్బంది

శాస్త్రీయకోణంలో దర్యాప్తు చేపట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్ : సాంకేతిక పరిజ్ఞానాన్ని అనుసరించి సైబర్ కేసుల దర్యాప్తులో నైపుణ్యం పెంపొందించుకుని శాస్త్రీయ కోణంలో దర్యాప్తు చేయాలని ఎస్పీ జి.ఆర్.రాధిక అన్నారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో సైబర్ నేరాల దర్యాప్తు, కేసుల ఛేదన, ముద్దాయిల అరెస్టు తదితర అంశాలపై సీఐలతో సమీక్ష నిర్వహించారు. ముందుగా ఓటీపీ, కేవైసీ, జాబ్, లోన్‌యాప్స్, ఆధార్ ఎనేబుల్డ్, ఫేక్ కస్టమర్‌కేర్ ఫ్రాడ్స్ వంటి సైబర్ కేసుల దర్యాప్తులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సైబర్ నేరాలు–నివారణా చర్యలపై ప్రతి పోలీసు అధికారి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ తరహా నేరాల్లో మొబైల్ ఫోన్ కీలకంగా మారుతుందన్నారు. బ్యాంకు అకౌంట్లలో నగదు పోగొట్టుకున్న బాధితులు ముందుగా టోల్‌ఫ్రీ నంబర్ 1930కు కాల్ చేసి సంబంధిత బ్యాంకుకు వెళ్లి ఫిర్యాదు చేసేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ (క్రైమ్) టి.పి.విఠలేశ్వరరావు, డీఎస్పీలు మహేంద్రమాతే, ఎం.శివరామిరెడ్డి, సీఐలు బి.ప్రసాదరావు, పి.శ్రీనివాసరావు, ఎల్.సన్యాసినాయుడు, ఆర్‌సీహెచ్.ఈశ్వరప్రసాద్, రవిప్రసాద్, శ్రీనివాసరావు, సైబర్ సెల్ ఎస్ఐ ప్రసాదరావు, ఏఎస్ఐ రమేష్, పీఆర్వో భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా పథకాల అమలు

శ్రీకాకుళం అర్బన్: జిల్లా స్త్రీ, శిశు సంక్షేమశాఖలో అమలు చేస్తున్న ప్రభుత్వ పథకాలను ప్రతి ఒక్క సీడీపీవో సక్రమంగా అమలు చేయాలని ఐసీడీఎస్ పీడీ జి.జయదేవి అన్నారు. శ్రీకాకుళం ఐసీడీఎస్ కార్యాలయంలో బుధవారం సీడీపీఓలతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సీడీపీవోలు, అంగన్‌వాడీ అధికారులు పాల్గొన్నారు.

వాసుదేవుని సన్నిధిలో జొన్నవిత్తుల

మందస: ప్రముఖ సాహితీవేత్త, రచయిత, అవధాని జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు బుధవారం మందస పట్టణంలోని శ్రీవాసుదేవుడిని దర్శించుకున్నారు. ఆలయ సంప్రదాయాలతో ప్రధాన అర్చకులు గోపినంబాళ్ల దాసుకూర్మాచార్యులు, సచ్చిదానందపాఢి జొన్నవిత్తులను ఆహ్వానించారు. ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు చేసి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం అర్చకులు ఆలయ విశిష్టత, పునఃనిర్మాణం, చరిత్ర ఆయనకు వివరించారు.

బదిలీపై జిల్లాకు ముగ్గురు డీఎస్పీల రాక

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాకు ముగ్గురు డీఎస్పీలు బదిలీపై వస్తున్నట్లు రాష్ట్ర డీజీపీ కేవీ రాజేంద్రనాథ్ రెడ్డి ఉత్తర్వులు జారీచేశారు. శ్రీకాకుళం, టెక్కలి, కాశీబుగ్గ సబ్ డివిజన్‌లకు వై.శృతి (ప్రస్తుతం ఆత్మకూరు), డి.బాలచంద్రారెడ్డి (రామచంద్రపురం), జి.నాగేశ్వరరెడ్డి (నందిగామ)లు వస్తున్నట్లు ఈ ఉత్తర్వుల్లో ఉన్నాయి. కాశీబుగ్గ డీఎస్పీగా ఉన్న ఎం.శివరామరెడ్డి పదోన్నతిపై విశాఖపట్నం నార్త్ ఏసీపీగా బదిలీపై వెళ్లనున్నారు.

రక్తహీనత నివారించాలి: కలెక్టర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: గర్భిణులు, పిల్లల్లో రక్తహీనత నివారణకు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ ఐసీడీఎస్ పీఓలను ఆదేశించారు. మహిళా శిశు సంక్షేమ శాఖ పీఓలతో బుధవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆయన సమీక్షించారు. రక్తహీనత గల పిల్లలు, గర్భిణులకు క్రమం తప్పకుండా ఫోలిక్ యాసిడ్ మాత్రలు, తదితరమైనవి పంపిణీ చేయాలన్నారు. అంగన్‌వాడీ వర్కర్లు డేటా ఎంట్రీ సరిగా చేయకపోతే సంబంధిత సీడీపీఓపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. అంగన్‌వాడీ వర్కర్లకు డేటా ఎంట్రీపై శిక్షణ ఇవ్వాలని సూచించారు. స్టాక్ సరఫరా చేయని అంగన్‌వాడీ వర్కర్లను సస్పెండ్ చేయాలని స్పష్టం చేశారు. సమావేశంలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఇన్‌చార్జి పీడీ జి. జయదేవి, సీడీపీఓలు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

అవయవదానం స్ఫూర్తిదాయకం

సోంపేట: బిడ్డ అవయదానం చేసి మీరు చూపించిన స్ఫూర్తి చిరస్మరణీయమని అవయదాత ఎం.కిరణ్‌చంద్ తల్లిదండ్రులను జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ, సమన్వయకర్త పిరియా సాయిరాజ్ అభినందించారు. సోంపేటలో కిరణ్‌చంద్ తల్లిదండ్రులు మోహన్, గిరిజా కల్యాణిలను బుధవారం కలిసి సంతాపం తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిడ్డ మృతిచెందాడన్న బాధను తట్టుకుని తీసుకున్న నిర్ణయం ఎందరికో స్ఫూర్తినిచ్చిందన్నారు. ప్రభుత్వం తరఫున సహాయ సహకారాలు అందించడానికి తమ వంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్, శిలగాన భాస్కరరావు, శ్రీను, నెహ్రూ, క్రాంతి శ్రీను తదితరులు పాల్గొన్నారు. కిరణ్‌చంద్ కుటుంబ సభ్యులను కేజీహెచ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉలాల కోదండరామ్ పరామర్శించి సంతాపం తెలియజేశారు. ఆయనతో పాటు గోవిందరాజులు, మద్దు సోమశేఖర్ ఉన్నారు.



కిరణ్‌చంద్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, సాయిరాజ్

అరుణాచల గిరి ప్రదక్షిణకు ప్రత్యేక బస్సులు

శ్రీకాకుళం అర్బన్: పౌర్ణమి(మే నెల 5వ తేదీ) సందర్భంగా అరుణాచల గిరి ప్రదక్షిణకు వెళ్లే ప్రయాణికుల కోసం ఐదు రోజుల సత్వర యాత్రను శ్రీకాకు ళం జిల్లా ప్రజా రవాణా సంస్థ రూపొందించిందని శ్రీకాకుళం ఆర్టీసీ 1, 2 డిపోల మేనేజర్‌లు కె.మాధవ్, కేఎస్ఆర్ శర్మలు తెలిపారు. శ్రీకాకుళంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ కార్యాలయంలో మంగళవారం అరుణాచల గిరి ప్రదక్షిణలకు సంబంధించిన కరపత్రాలను శ్రీకాకుళం ఆర్టీసీ 1, 2 డిపోల మేనేజర్‌లు, సిబ్బంది ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లా నుంచి మే నెల 3వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు బస్సు బయల్దేరి కాణిపాకం, శ్రీపురం దర్శనం చేసుకుని అరుణాచలం వెళ్లి గిరి ప్రదర్శన చేసే అవకాశం కల్పించినట్లు తెలిపారు. తిరుగు ప్రయాణంలో కంచి దర్శనం చేసు కుని మే నెల 7వ తేదీన శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ నకు ప్రయాణికులను చేరుస్తామన్నారు. ఈ యాత్ర కు రాను పోను టికెట్ చార్జీ రూ.4500 నిర్ణయించినట్లు తెలిపారు. ఈ ప్రత్యేక సర్వీసులలో సీట్లను ముందుగా రిజర్వు చేయించుకునే సౌకర్యం కూడా ఉందని పేర్కొన్నారు. శ్రీకాకుళం బస్ స్టేషన్ లో గల రిజర్వేషన్ కౌంటర్ నందు టిక్కట్లు లభిస్తాయన్నారు. వివరాలకు 7382921647, 9959225608, 7382919696 ఈ ఫోన్ నంబర్లకు సంప్రదించాలని ప్రయాణికులకు విజ్ఞప్తి చేశారు.

వేర్వేరు ఘటనల్లో ముగ్గురి మృతి



బాబూరావు మృతదేహం

టెక్కలి రూరల్ : స్థానిక మండపొలం కాలనీకి చెందిన నెయ్యిల బాబూరావు(30) బుధవారం హైదరాబాద్‌లో విద్యుత్ షాక్‌తో మృతిచెందాడు. కొన్నాళ్లుగా పెయింటింగ్ పనులు చేస్తున్న బాబూరావు బుధవారం ఓ కళాశాల భవనానికి రంగు వేస్తుండగా పైనున్న విద్యుత్ తీగలకు తగిలి షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. ఇతనికి భార్య యమున, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఇంటి పెద్ద దిక్కు కోల్పోవడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా రోదిస్తున్నారు.

పొట్టిశ్రీరాములు కూడలి లో..



ఆనందరావు మృతదేహం

శ్రీకాకుళం క్రైమ్ : పట్టణంలోని పొట్టి శ్రీరాములు కూడలి సమీపంలో మందుల దుకాణం వద్ద ఓ వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందినట్లు ఒకటో పట్టణ ఎస్ఐ బలివాడ గణేష్ తెలిపారు. కిల్లిపాలెం గ్రామానికి చెందిన మెరకాన ఆనందరావు (47) లేబర్ పనులు చేస్తూ వచ్చే డబ్బులతో మద్యానికి అలవాటు పడి మూడురోజులకు, వారంరోజులకోసారి ఇంటికి వెళ్తూ నిత్యం బయటే గడిపేవాడు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి మెడికల్‌షాపు వద్ద మృతిచెందాడు. ఈయనకు భార్య లావణ్య, కుమారుడు ప్రసాద్ ఉన్నారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

సత్యసాయి మందిరం వద్ద..



వృద్ధుడి మృతదేహం

శ్రీకాకుళం క్రైమ్ :అరసవిల్లి సూర్యనారాయణ స్వామి గుడి సమీపంలోని సత్యసాయి సేవా సమితి మందిరం మెట్లపై ఓ వృద్ధుడు మృతి చెందినట్లు స్థానిక వీఆర్వో కొయ్యాన లీలా ప్రసన్న ఫిర్యాదు ఇవ్వడంతో కేసు నమోదు చేసినట్లు ఒకటో పట్టణ ఎస్ఐ బలివాడ గణేష్ తెలిపారు. వృద్ధుని జేబులో ఆధార్‌కార్డును చూడగా అల్లంశెట్టి ముకుందరావు, సోంపేట టౌన్, మెయిన్‌స్ట్రీట్ అని ఉందని చెప్పారు. బంధువులకు సమాచారం అందించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

పక్కాగా భూ హద్దు..



సర్వే రాళ్ల ఏర్పాటు ప్రక్రియను పరిశీలిస్తున్న సర్వే విభాగం ఏడీ ప్రభాకర రావు, సర్వే అధికారులు

- రీసర్వే పూర్తయిన గ్రామాల్లో ముమ్మరంగా సర్వే రాళ్ల ఏర్పాటు
- జిల్లాలో 354 గ్రామాల్లో రీ సర్వే రాళ్లు ఏర్పాటు చేస్తున్న అధికారులు
- ఇప్పటికే 3,29,542 సర్వే రాళ్లను సమకూర్చిన అధికారులు

టెక్కలి: రాష్ట్ర వ్యాప్తంగా భూ వివాదాలు, ప్రభుత్వ భూముల పరిరక్షణ కోసం ప్రభుత్వం సరికొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టింది. ఎప్పుడో 1956 లో రాష్ట్ర వ్యాప్తంగా భూ సర్వే నిర్వహించి హద్దులను కేటాయించారు. ఆ తర్వాత మారుతున్న కాలంతో పాటు హద్దులు చెరిగిపోయి తరచూ భూ వివాదాలు చోటు చేసుకున్నాయి. భూ వివాదాల అంశం అధికారులకు పెద్ద తలనొప్పిగా ఉండేది. భూ సమస్యల పరిష్కారం కోసం రైతులు, యజమానులు అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగేవారు. ఇలాంటి సమస్యలన్నింటికీ శాశ్వతమైన పరిష్కారం చూపే విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సరికొత్త ఆలోచన చేశారు. 'వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు– భూ రక్ష పథకానికి' శ్రీకారం చుట్టారు. మొదటి విడతగా రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 2 వేల గ్రామాల్లో రీ సర్వే ప్రక్రియ పూర్తి చేశారు. ఇందులో భాగంగా జిల్లాలో 354 గ్రామాల్లో రీసర్వే ప్రక్రియ చేపట్టి ఆయా రైతులకు ఎల్‌పీఎం పత్రాలను అందజేశారు. ఇప్పుడు రీసర్వే పూర్తయిన గ్రామాల్లో ఆయా భూముల్లో పక్కాగా హద్దు కేటాయించేందుకు సర్వే రాళ్లను ఏర్పాటు చేస్తున్నారు. జిల్లా, మండల, గ్రామ సచివాలయం పరిధిలో గల సర్వే విభాగానికి చెందిన సిబ్బంది సర్వే రాళ్ల ఏర్పాటులో నిమగ్నమయ్యారు.

354 గ్రామాల్లో..

రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన మోడల్ రీ సర్వేలో భాగంగా జిల్లాలో 354 గ్రామాల్లో సుమారు 1,40,533.74 ఎకరాల్లో రీ సర్వేను పూర్తి చేశారు. రీ సర్వే పూర్తి చేసిన గ్రామాల్లో హద్దులు కేటాయించేందుకు సుమారు 4,48,316 సర్వే రాళ్లు అవసరం కాగా, ఇప్పటికే 3,29,542 సర్వే రాళ్లను సమకూర్చారు. అంతే కాకుండా 90 గ్రామాల్లో సుమారు 25,392.75 ఎకరాల్లో 2,42,115 సర్వే రాళ్లను ఏర్పాటు చేశారు. మే 20 నాటికి పూర్తి స్థాయిలో సర్వే రాళ్లు ఏర్పాటు చేసేందుకు ముమ్మరంగా చర్యలు చేపడుతున్నారు. సర్వే రాళ్ల ఏర్పాటు కోసం జిల్లాకు 94 రోవర్లు కేటాయించారు. ఒక్కో రోవర్ ద్వారా రోజుకు 100 సర్వే రాళ్లు ఏర్పాటు చేసే విధంగా ప్రణాళిక రూపొందించారు.

సర్వే చేసి రాళ్లు పాతారు



నాకు ఉన్న 70 సెంట్ల స్థలంలో అధికారులు సర్వే చేశారు. ఇప్పుడు రాళ్లు పాతారు. సర్వే సక్రమంగానే చేశారు. సర్వేకు, రాళ్లు పాతడానికి ఒక్క రూపాయి కూడా అడగలేదు. ఈ సర్వే వల్ల మాకు హద్దులు బాగా తెలిశాయి. – పి.చిన్నయ్య, రైతు, రేగులపాడు, కోటబొమ్మాళి మండలం.

వివాదాలకు పరిష్కారం

ప్రభుత్వం తలపెట్టిన రీ సర్వే వల్ల భూ సమస్యలు శాశ్వతంగా పరిష్కారమవుతాయి. అంతే కాకుండా ప్రభుత్వ భూములు పరిరక్షించవచ్చును. జిల్లాలో మోడల్ రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో సర్వే రాళ్లను ఏర్పాటు చేస్తున్నాం. మే 20 లోగా ఈ ప్రక్రియను పూర్తి చేస్తాం.

– ఎం.ప్రభాకరరావు, ఏడీ, జిల్లా సర్వే విభాగం